

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 15-11-2025 | సంపుటి - 25 | సంచిక -180 | రూ : 4 | పేజీలు: 8



2లో

## ఎగ్జిట్‌లో సొంతిల్లు

- ఓఆర్ఆర్ చుట్టుపక్కల నివాసాలకు పెరుగుతున్న గిరాకీ

## కేసీఆర్ గురించి అందుకే మాట్లాడను

### జూబ్లీహిల్స్ ఫలితంపై రేవంత్ రెడ్డి స్పందన

- ఈ గెలుపు తమ బాధ్యతను మరింతగా పెంచిందన్న రేవంత్ రెడ్డి
- కేసీఆర్ రాజకీయాల్లో క్రియాశీలకంగా లేనందువల్ల ఆయన గురించి మాట్లాడబోనన్న రేవంత్
- కేటీఆర్‌కు అహంకారం పోలేదని, హరీశ్ రావు అసహనం తగ్గించుకోవాలని సూచన



2లో



2లో

## జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ ఓటమిపై స్పందించిన కేటీఆర్

- ప్రతిపక్ష పాత్ర పోషిస్తూనే ఉంటామన్న కేటీఆర్
- కార్యకర్తలు, మాగంటి సునీత ఎంతో కష్టపడ్డారన్న కేటీఆర్
- ఉప ఎన్నిక ఎలా జరిగిందో అందరికీ తెలుసని వ్యాఖ్య

## బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన మజ్లిస్ పార్టీ

### కొచ్చధామన్ సీటు గెలుపు

- ముస్లిం జనాభా అధికంగా ఉండే సీమాంచల్ ప్రాంతంలో పలు స్థానాల్లో మజ్లిస్ ఆధిక్యం
- కొచ్చధామన్ నియోజకవర్గం నుంచి మజ్లిస్ అభ్యర్థి ఎండీ సర్వార్ ఆలమ్ గెలుపు
- సమీప ఆర్జేడీ అభ్యర్థి ముజాహిద్ ఆలమ్‌పై 23,021 ఓట్ల మెజార్టీ

2లో






2లో

## "కర్మ హిట్స్ బ్యాక్"..

### జూబ్లీహిల్స్ ఫలితాల నేపథ్యంలో కవిత ఆసక్తికర ట్వీట్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు
- 24 వేల ఓట్లతో ఓడిపోయిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి
- ఈ తరుణంలో చర్చనీయాంశంగా మారిన కవిత ట్వీట్

## జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ ఘన విజయం..

### మాగంటి సునీతపై నవీన్ యాదవ్ జయకేతనం

- 24,729 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ ఘన విజయం
- తొలి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు కాంగ్రెస్ ఆధిపత్యం
- ఈసీ నుంచి వెలువడిన అధికారిక ప్రకటన



2లో

# ఎన్డీయే ప్రభంజనం



- బిహార్‌లో చరిత్రాత్మక విజయం
- 202 స్థానాల్లో జయభేరి
- నీతీశ్‌కే పట్టంకట్టిన బిహారీ ఓటర్లు
- తుడిచిపెట్టుకుపోయిన మహాగఠ్‌బంధన్
- రాఘోపూర్‌లో అతి కష్టమ్మీద గెలిచిన తేజస్వీ

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించింది. నీతీశ్, మోదీల జోడీ సూపర్‌హిట్ కొట్టింది. ఆ కూటమే ఊహించనంతగా.. ఎగ్జిట్ పోల్స్‌కూ అందనంతగా అప్రతిహత విజయాన్ని సాధించి చరిత్ర సృష్టించింది. నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే 202 సీట్లతో అందనంత ఎత్తున నిలిచింది. ఆర్జేడీ

తరువాయి 2లో




## అభివృద్ధికి మార్గాలు ఇవే

2లో

- విశాఖపట్నంలో 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- అభివృద్ధికి పెట్టుబడులు, ఆవిష్కరణలే కీలకమన్న సీఎం చంద్రబాబు
- పరిశ్రమల ఏర్పాటుకు 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్
- ప్రకృతి వ్యవసాయం, ఆక్వా రంగాల్లో ఏపీకి అగ్రస్థానం
- గ్లోబల్ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన అరకు కాఫీ
- కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం పెట్టుబడులకు అనుకూలం అని వెల్లడి

# అభివృద్ధికి మార్గాలు ఇవే: సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 14 : పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, భాగస్వామ్యాలే రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ ప్లీనరీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సును కేవలం పెట్టుబడుల కోసం మాత్రమే చూడొద్దని నెట్వర్కింగ్ కోసం, మేధోపరమైన చర్చల కోసం, ఆవిష్కరణల కోసం ఏర్పాటు చేశామని అన్నారు. సౌదీ, రష్యా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ, శ్రీలంక, జపాన్, కెనడా తదితర దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కావటం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. పరస్పరం పెట్టుబడుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధించగలమనే విషయాన్ని గుర్తించాలని సీఎం కోరారు. సింగపూర్ చాలా చిన్న దేశమైనా అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చిందని తెలిపారు.

*** ఏపీ ప్రకృతిసాగులో అగ్రస్థానం... పర్యాటక రంగంలో పెట్టుబడులకు అనుకూలం**

ఆర్గానిక్ ఉత్పత్తిగా అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగిందని, ఆక్వా ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయంలోనూ ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని సీఎం వివరించారు. "ఖనిజాలు, రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో కొత్త టెక్నాలజీలతో పని చేసే సంస్థలతో భాగస్వాములయ్యేందుకు ఏపీ సిద్ధంగా ఉంది. ఏపీలోని సుదీర్ఘ తీరప్రాంతం,




గండికోట, అరకు లాంటి ప్రకృతి అందాలు పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి అనుకూలమైన ప్రదేశాలు. అలాగే కొత్తగా భారతీయ రుచులకు సంబంధించిన రంగాల్లోనూ విస్తృత అవకాశాలు వినియోగించుకోవచ్చు. ఏపీలోని వివిధ ప్రాంతాల్లోని సంప్రదాయాలు, చేతివృత్తులను ప్రోత్సహించేందుకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. డేటా లేక్, రియల్ టైమ్ డేటా ద్వారా త్వరితగతిన నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. సాంకేతికత సాయంతో అతి తక్కువ నష్టంతోనే ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కుంటున్నాం. నూతన ఆవిష్కరణలు, యువతకు నైపుణ్యాల కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేశాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

*** అందుబాటులో 50 వేల ఎకరాలు**

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు, ప్రాజెక్టుల ఏర్పాటు కోసం 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ అందుబాటులో ఉంచామని సీఎం చంద్రబాబు అన్నారు. మానవాళి సంక్షేమం కోసం అంతా కలిసి పనిచేద్దామని దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులకు, పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సుస్థిరమైన ప్రభుత్వం ఉందని అన్నారు. బీహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ మళ్లీ విజయం సాధించిందని, ఎన్డీఏపై నమ్మకం ఉంచిన ప్రజలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సుకు ఆర్మేనియా, సింగపూర్, మారిషస్, నేపాల్, అంగోలా, వెనిజులా దేశాలకు చెందిన మంత్రులు యూఎన్ఓ ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

## "కర్మ హిట్స్ బ్యాక్"... జూబ్లీహిల్స్ ఫలితాల నేపథ్యంలో కవిత ఆసక్తికర ట్వీట్

హైదరాబాద్, నవంబర్ 14 : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. "కర్మ హిట్స్ బ్యాక్" అంటూ ఆమె 'ఎక్స్' వేదికగా చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఎవరి పేరును గానీ, ఏ పార్టీ పేరును గానీ, ఏ అంశాన్ని గానీ ప్రస్తావించకుండా ఆమె కేవలం మూడు పదాల్లో ట్వీట్ చేయడం గమనార్హం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు వెలువడిన తరుణంలో ఆమె ఈ ట్వీట్ చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ సుమారు 24 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. బీఆర్ఎస్ ఓటమి నేపథ్యంలోనే కవిత ఈ ట్వీట్ చేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

## కేసీఆర్ గురించి అందుకే మాట్లాడను
# జూబ్లీహిల్స్ ఫలితంపై రేవంత్ రెడ్డి స్పందన

హైదరాబాద్, నవంబర్ 14 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు తమ బాధ్యతను మరింతగా పెంచిందని అన్నారు. రెండేళ్లు పూర్తి చేసుకున్న తమ పాలనకు ప్రజలు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు.

**కేసీఆర్ క్రియాశీలకంగా లేరు**

రాజకీయాల్లో కేసీఆర్ క్రియాశీలకంగా లేనందున తాను ఆయన గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉన్న నాయకుడిని విమర్శించడం భావ్యం కాదని అన్నారు. అయితే కేటీఆర్‌కు అహంకారం పోలేదని, హరీశ్ రావు అసహనం తగ్గించుకోవాలని హితవు పలికారు. వారి తీరు మారకుంటే ప్రజలు ఎలా అంగీకరిస్తారన్న విషయం అర్థం చేసుకోవాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా రేవంత్ రెడ్డి స్పందించారు. మంత్రుల అభిప్రాయాలను తీసుకుని స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ ఓటమిపై స్పందించిన కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 14 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రతిపక్షంగా తమ పాత్రను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. నిర్విరామంగా కృషి చేసిన కేసీఆర్ బృందానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో కష్టాలకోర్చి పనిచేసిన కార్యకర్తలకు ఆయన నమస్సులందించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ గెలుపొందాలని స్థానిక నాయకత్వం ఎంతో శ్రమించిందని ఆయన కొనియాడారు. రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం తామేనని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఇకపై ప్రజా సమస్యలపై తమ పార్టీ పోరాటం చేస్తుందని ఆయన ఉద్ఘాటించారు. వ్యక్తిగత సమస్యలు ఉన్నప్పటికీ పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు ఎంతో ఉత్సాహంగా పనిచేశారని కేటీఆర్ అన్నారు. గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ సమర్థవంతమైన పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. మాగంటి సునీతకు రాజకీయ అనుభవం లేకపోయినా ఎంతో కష్టపడ్డారని ఆయన ప్రశంసించారు. ఒక విధంగా ఆమె పోరాటమే చేశారని కొనియాడారు. గత రెండేళ్లుగా బీఆర్ఎస్ ప్రతిపక్ష పార్టీగా అద్భుతమైన పాత్రను పోషిస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. ప్రజా సమస్యలను ప్రధానంగా ఎంచుకొని పోరాడుతున్నామని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఉప ఎన్నికల్లో తాము ఎంతో నిజాయతీగా పోరాడామని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు ఎలా జరిగాయో అందరికీ తెలుసని ఆయన అన్నారు. వాటి గురించి తాను మాట్లాడదలుచుకోలేదని అన్నారు. ప్రచారం ముగిసే వరకు ఒక విధంగా, ముగిసిన తర్వాత మరో విధంగా జరిగాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2014 నుంచి 2023 మధ్య ఏడు ఉప ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ ఒక్క దాంట్లో కూడా గెలవలేదని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ఒకటి రెండు కార్పొరేటర్ సీట్లు మాత్రమే వచ్చాయని ఆయన గుర్తు చేశారు. ప్రజా సమస్యలను, ఆరు గ్యారెంటీలను, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకువెళతామని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని రకాలుగా కవ్వించే ప్రయత్నం చేసినా సంయమనం పాటించామని ఆయన వెల్లడించారు. తమ హయాంలో జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం రూ. 5 వేల కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజా సమస్యలపై పోరాటానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయ్యే వరకు శ్రమిద్దామని ఆయన అన్నారు. జాతీయస్థాయిలో చూస్తే బీఆర్ఎస్ ఉనికి కోల్పోయే పరిస్థితి వచ్చిందని వస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. బీఆర్ఎస్‌కు ఈ ఉప ఎన్నిక ఒక చిన్న ఎదురుదెబ్బ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. అధికార పార్టీ ఎన్నో ప్రలోభాలు పెట్టినా దీటుగా ఎదుర్కొని మంచి ఓటింగ్ సాధించామని అన్నారు. దొంగ ఓట్ల గురించి తాము స్పష్టమైన ఆధారాలు ఇచ్చామని, పోలింగ్ రోజు కూడా మాగంటి సునీత ఈ వ్యవహారాన్ని బయటపెట్టారని ఆయన గుర్తు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యే విషయమై బెంగాల్‌లో హైకోర్టు స్పష్టమైన తీర్పు వెలువరించిందని ఆయన ప్రస్తావించారు. రాష్ట్రంలో కూడా పదిచోట్ల ఉప ఎన్నికలు రావాల్సిందేనని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒక్క ఉప ఎన్నికకే కాంగ్రెస్ చాలా కష్టపడిందని, ఇక పదిచోట్ల ఉప ఎన్నికలు వస్తే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను తీసుకువస్తారేమోనని ఆయన వ్యాఖ్యానించారు. 'ఆర్ఎస్ బ్రదర్స్ 'పరస్పర సహకారంతో బాగా పనిచేశారని ఎద్దేవా చేశారు. ఈ ఉప ఎన్నికలో అది స్పష్టంగా కనిపించిందని ఆయన అన్నారు.

## బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన మజ్లిస్ పార్టీ.. కొచ్చధామన్ సీటు గెలుపు

బీహార్, నవంబర్ 14 : తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్ పార్టీ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తన ఖాతాను తెరిచింది. ముస్లిం జనాభా అధికంగా ఉన్న సీమాంచల్ ప్రాంతంలో మజ్లిస్ పార్టీ పలు స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతూ, ఒక స్థానంలో విజయం సాధించింది. కొచ్చధామన్ నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎండీ సర్వార్ ఆలమ్ గెలుపొందారు. సర్వార్ ఆలమ్ తన సమీప ఆర్జేడీ అభ్యర్థి ముజాహిద్ ఆలమ్‌పై 20 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సర్వార్ ఆలమ్‌కు 81,860 ఓట్లు రాగా, ఆర్జేడీ అభ్యర్థి ముజాహిద్ ఆలమ్ కు 58,839 ఓట్లు, బీజేపీ అభ్యర్థి బినాదేవికి 44,858 ఓట్లు వచ్చాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జేడీయూ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమి అద్భుత విజయాన్ని నమోదు చేస్తున్న విషయం తెలిసిందే. 243 స్థానాలకు గాను ఈ కూటమి 200కి పైగా సీట్లలో విజయం సాధించే అవకాశం ఉంది. మహాఘట్‌బంధన్ 36 సీట్లకు పరిమితమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్డీయే కూటమిలో బీజేపీ 94, జేడీయూ 78, ఎల్‌జేపీ (ఆర్వీ) 19, హెచ్ఏఎం (ఎస్) 5, ఆర్ఎల్ఎం 4 సీట్లలో ముందంజలో ఉన్నాయి లేదా గెలుపొందాయి. మహాఘట్‌బంధన్‌లో ఆర్జేడీ 29, కాంగ్రెస్ 4 సీట్లలో ముందంజలో ఉన్నాయి లేదా గెలుపొందాయి.

## జానపద గాయకురాలి నుంచి ఎమ్మెల్యేగా..
# అతిచిన్న వయస్సులో అలీ నగర్ నుంచి గెలిచిన మైథిలీ ఠాకూర్

బీహార్, నవంబర్ 14 : బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అలీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రముఖ జానపద గాయని మైథిలీ ఠాకూర్ (25) విజయం సాధించారు. అతి చిన్న వయస్సులో ఆమె బీహార్ అసెంబ్లీకి ఎన్నికైన రికార్డు సృష్టించారు. అలీనగర్ నుంచి ఆమె తన సమీప ఆర్జేడీ అభ్యర్థి బినోద్ మిశ్రాపై 11,730 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. తన గెలుపుపై మైథిలీ ఠాకూర్ స్పందిస్తూ, తనకు మాటలు రావడం లేదని అన్నారు. ఈ విజయం ప్రజలదేనని ఆమె పేర్కొన్నారు. అలీనగర్ నియోజకవర్గ ప్రజలు గెలిచినట్లుగా భావిస్తున్నానని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. బీజేపీ పట్ల ప్రజలు నమ్మకం ఉంచారని ఆమె తెలిపారు. మైథిలీ ఠాకూర్‌తో పాటు పాతికేళ్ల వయస్సులో ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో సోను కుమార్ (గోహ్), నవీన్ కుమార్ (భట్నాహ), కుందన్ కుమార్ (షేక్‌పురా), శంబూబాబు (సుపాల్), రాజ్ కుమార్ సాదా (సిమ్రీ భక్తీయార్‌పూర్) ఉన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 25 నుంచి 30 ఏళ్లు కలిగిన ఎమ్మెల్యేలు నలుగురు, 3140 ఏళ్లు కలిగిన వారు 32 మంది, 4150 ఏళ్ల వారు 83 మంది, 5160 ఏళ్లు కలిగినవారు 65 మంది, 6170 ఏళ్ల వారు 47 మంది, 7180 ఏళ్లు కలిగిన వారు 10 మంది ఉన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల సగటు వయస్సు 51 సంవత్సరాలుగా ఉంది.

## జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ ఘన విజయం.. మాగంటి సునీతపై నవీన్ యాదవ్ జయకేతనం

హైదరాబాద్, నవంబర్ 14 : అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తొలి రౌండ్ నుంచి చివరి వరకు నవీన్ యాదవ్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ ఏకపక్ష విజయాన్ని నమోదు చేశారు. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు పోలయ్యాయి. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి దీపక్ రెడ్డి 17,061 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. లెక్కింపు ప్రక్రియలో ఏ దశలోనూ బీఆర్ఎస్ అభ్యర్థి కాంగ్రెస్‌కు పోటీ ఇవ్వలేకపోయారు. రౌండ్ రౌండ్‌కు మెజార్టీని పెంచుకుంటూ నవీన్ యాదవ్ తన గెలుపును సులభతరం చేసుకున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఈ కీలక ఉప ఎన్నికలో విజయం సాధించడం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ఈ గెలుపు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజకీయంగా మరింత బలాన్ని చేకూర్చింది. ఫలితాలు వెలువడిన వెంటనే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు.

# ఎన్డీయే ప్రభంజనం

హైదరాబాద్, నవంబర్ 14 : పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించింది. నీతీశ్, మోదీల జోడీ సూపర్‌హిట్ కొట్టింది. ఆ కూటమే ఊహించనంతగా.. ఎగ్జిట్ పోల్స్‌కూ అందనంతగా అప్రతిహత విజయాన్ని సాధించి చరిత్ర సృష్టించింది. నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే 202 సీట్లతో అందనంత ఎత్తున నిలిచింది. ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ చావుదెబ్బ తింది. కేవలం 34 సీట్లతో చావుతప్పి కన్నులొట్టపోయినట్లుగా ప్రతిపక్ష హోదాకు అర్హత సాధించగలిగింది. ఇక సంచలనం సృష్టిస్తానని మొత్తం 243 సీట్లలో పోటీ చేసిన ప్రశాంత్ కిశోర్ పార్టీ జన్ సురాజ్ అసలు ఖాతానే తెరవలేదు. గతంలో మాదిరిగానే ఎంఐఎం మళ్లీ 5 చోట్ల గెలిచి పట్టు నిలబెట్టుకుంది. సమన్వయం, అభివృద్ధి హామీలు, మహిళలకు నగదు బదిలీవంటి వాటితో ఎన్డీయే అద్భుత ఫలితాలను సాధించగా.. అంతర్గత కలహాలు, సీట్ల సర్దుబాటులో అయోమయం, నేతల మధ్య సమన్వయ లోపంవల్ల విపక్ష కూటమి చతికిలపడింది. లోక్‌సభ ఎన్నికల్లో కొంత వెనుకంజ తర్వాత హరియాణా, మహారాష్ట్ర, దిల్లీల్లో ప్రభంజనం.. తాజాగా బిహార్‌లో ఘన విజయం ఎన్డీయేకు సరికొత్త ఉత్సాహాన్నిచ్చినట్లయింది. బిహార్‌లోని 9 రీజియన్లలోనూ ఎన్డీయే కూటమి భారీ విజయాలను నమోదు చేసింది. ముస్లింల ప్రాబల్యమున్న సీమాంచల్‌లాంటి ప్రాంతాల్లోనూ ఆర్జేడీని మట్టికరిపించింది. ముస్లింయాదవ్‌ల సమీకరణాన్ని నమ్ముకున్న మహాగఠ్‌బంధన్ ఆ వర్గాలకు పట్టున్న చోట్లా పాగా వేయలేకపోయింది. ఎన్డీయే తలకెత్తుకున్న మహిళయువత (ఎంవై) సూపర్‌హిట్ కాగా.. ఆర్జేడీ ఫార్ములా ముస్లిం యాదవ్ (ఎంవై) అట్టర్ ఫ్లాప్ అయింది. ఎన్డీయే విజయంతో బిహార్‌లోని పట్నాలో, దేశ రాజధాని దిల్లీలో ఆయా పార్టీల సంబరాలు అంబరాన్నంటాయి. నీతీశ్ నివాసంవద్ద 'టైగర్ అభీ జిందా హై' అనే పోస్టర్లు దర్శనమిచ్చాయి. ఆయన ఇంకా అలసిపోలేదని, పాలించే సత్తా ఇంకా ఉందని కార్యకర్తలు వ్యాఖ్యానించారు. ప్రధాన మోదీ, ముఖ్యమంత్రి నీతీశ్.. బిహార్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 32 సీట్లలో పోటీ చేసిన ఎంఐఎం 5 సీట్లు గెలుచుకుంది. ఈ పార్టీ ముస్లిం ప్రాబల్య ప్రాంతాల్లో ఆర్జేడీని దెబ్బతీసినట్లు తెలుస్తోంది.

**అతి పెద్ద పార్టీగా భాజపా**

ఈ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా భాజపా అవతరించింది. ఆ పార్టీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. దాని స్ట్రైక్‌రేట్ 88శాతంగా ఉంది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది.

# ఎగ్జిట్‌లో సొంతిల్లు

హైదరాబాద్ : బాహ్యవలయ రహదారి అంటే ఇదివరకు చాలా దూరం అన్పించేది. నివాసాలు ఎక్కువగా ఇన్నర్ రింగ్‌రోడ్డు చుట్టుపక్కల కేంద్రీకృతం కావడం.. అక్కడి నుంచి ఓఆర్ఆర్ వరకు మధ్యలో చాలా ఖాళీ ఉండటంతో దూరమని భావించేవారు. ఇప్పుడు సిటీ విస్తరించింది. రవాణా అనుసంధానం పెరగడంతో కొనుగోలుదారుల చూపు సైతం ఈ ప్రాంతాలపై పడింది. ఓఆర్ఆర్‌లోని 19 ఎగ్జిట్‌లు నివాస కేంద్రాలుగా మారుతున్నాయి.

**బడ్జెట్ ధరల్లో..**

ప్రధాన నగరంలో అన్ని వర్గాలు ఇళ్లు కొనలేని పరిస్థితులు ఉన్నాయి. కోటి రూపాయలు లేనిదే 3 బీహెచ్‌కే ఫ్లాట్ రావడం లేదు. వ్యక్తిగత నివాసాలు, విల్లాలంటే చాలా ఖరీదు. అదే ఓఆర్ఆర్ పరిసరాల్లో అన్ని వర్గాలకు నివాసాలు వారి బడ్జెట్‌కు అనుగుణంగా అందుబాటులో ఉన్నాయి. రూ.50 లక్షల నుంచి అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లను విక్రయిస్తున్నారు. రూ.కోటి ధరల శ్రేణిలో వ్యక్తిగత నివాసాలు వస్తున్నాయి. రూ.24 కోట్ల శ్రేణిలో విల్లా ప్రాజెక్టులు ఉన్నాయి. ఇవన్నీ ఓఆర్ఆర్‌కు చేరువలో కావడం గమనార్హం. దూరం వెళ్లేకొద్దీ ధరలు తగ్గుతాయి.

ఇప్పుడే అవకాశం...: ప్రస్తుతం మార్కెట్ స్తబ్దుగా ఉండటంతో ధరలు నిలకడగా ఉన్నాయి. స్థలాలు, అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు ఏదైనా బడ్జెట్‌కు అనుగుణంగా కొనుగోలు చేసేందుకు ఇది అనువైన సమయమని నిర్మాణ సంఘాలు సూచిస్తున్నాయి. ధరలు పెరిగే సమయంలో కాకుండా ముందే కొంటే ఆ మేరకు ఆర్థికంగా ప్రయోజనం ఉంటుందని వాటి ప్రతినిధులు చెబుతున్నారు.

## వ్యక్తికి 10 సంవత్సరాల జైలు శిక్ష




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పోలీస్ స్టేషన్‌పై దాడి, హత్యాయత్నం కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె. కిరణ్ కుమార్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే... పాల్వంచ పట్టణం ఇందిరాకాలనీకి చెందిన కళానిధి ప్రేమ్‌సింగ్ అనే వ్యక్తి 2021 నవంబరు 26న అర్ధరాత్రి పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించి, ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంతోపాటు విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ హరిబాబు, కానిస్టేబుల్ కృష్ణ ప్రసాద్‌లపై కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన అప్పటి ఎస్సై జె. ప్రవీణ్‌కు దర్యాప్తు చేసి కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. 8 మంది సాక్షులను విచారించిన అనంతరం కళానిధి ప్రేమ్ సింగ్‌పై నేరం రుజువు కావడంతో 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారను. ప్రాసిక్యూషన్‌ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారం రాజారావు నిర్వహించగా, కోర్టు నోడల్ ఆఫీసర్ డి.రాఘవయ్య, లైజన్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్, డ్యూటీ ఆఫీసర్, పిసి జరుపుల రవిలు సహకరించారు.

## బాలాజీ నగర్ డివిజన్ లో ఘనంగా బాలల దినోత్సవం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : బాలల దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జవహర్ బాల్మంచ్ కో అర్డినేటర్ , యూత్ కాంగ్రెస్ స్టేట్ సెక్రటరీ జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలాజీ నగర్ డివిజన్ లోని మూసాపేట్ లో గల బచపన్ పాఠశాలలో, ప్రగతినగర్ కమిటీ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పిల్లలతో కలిసి కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, బి బ్లాక్ అద్యక్షులు తుమ్ వేణు , మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పా రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రకాష్, చిన్ను పాషా, శేఖర్ గౌడ్,తూము సంతోష్, సచిన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి బాలలే... రేపటి పౌరులు

* సన్మార్గంలో నడిచి మంచి పౌరులుగా ఎదగాలి
* ప్రధానోపాధ్యాయురాలు సుంచు సాయిశ్రీ




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: నేటి బాలలే... రేపటి దేశ పౌరులని, సన్మార్గంలో నడిచి మంచి పౌరులుగా ఎదగాలని ప్రధానోపాధ్యాయురాలు సుంచు సాయిశ్రీ అన్నారు. ముస్తాబాద్ మండలంలోని అంబేద్కర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దేశ మొదటి ప్రధాని జవహార్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలను, స్వయం పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నందిని, ఉష శ్రీ, కార్తీక్, మణికంఠ శ్రీనాథ్, డొక్కా అనన్య, డొక్కా పల్లవి, హేమశ్రీ, నందిత, ప్రీతి, నిత్యూష, జాన్విక, వినోద్, రాజేష్ ఉపాధ్యాయులుగా మారి బోధనలు చేశారు. అనంతరం ప్రదానోపాధ్యాయురాలు మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ కీలకమని, ఈ దశలో మనం నడిచే మార్గమే మన భవిష్యత్‌ను నిర్దేశిస్తుందన్నారు. మంచి క్రమశిక్షణతో మెదులుతూ కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చట్టాలున్నాయి

* జిల్లా న్యాయమూర్తి పాటిల్ వసంత్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: డ్రగ్స్ తయారీ, సరఫరా, విక్రయం, వాడకం అనేది క్షమించరాని నేరం అని, మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చట్టాలున్నాయని, ఈ చట్టం కింద నేరం రుజువైతే కఠిన కారాగార శిక్షలు, భారీ జరిమానాలు ఉంటాయని జిల్లా న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో గతరువ 15వ తేదీ నుండి శుక్రవారం వరకు నెలరోజులపాటు 'చైతన్యం - డ్రగ్స్ పై యుద్ధం' పేరుతో అనేక అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమం సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుండి ప్రకాశం స్టేడియం భారీ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణకు సంబంధించిన చట్టపరమైన అంశాలు, నేరస్తులకు విధించే శిక్షలు, న్యాయ వ్యవస్థ పాత్ర గురించి వివరించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం న్యాయ వ్యవస్థ ఎల్లప్పుడూ పోలీసులకు, ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

డ్రగ్స్ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవరోధం: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ప్రభుత్వ యంత్రాంగం తరపున డ్రగ్స్ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను, అభివృద్ధికి డ్రగ్స్ లేని సమాజం యొక్క ఆవశ్యకతను కలెక్టర్ జితేష్ వి. పాటిల్ వివరించారు. నెల రోజులపాటు ఎస్పీ సారధ్యలో విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పోలీసు శాఖను, చైతన్యం అవగాహనా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న యువతను, విద్యార్థులను అభినందించారు. యువత డ్రగ్స్‌కు బానిసలు కాకుండా ఉండేందుకు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి సానుకూల ప్రత్యామ్నాయాలను అలవాటు చేసుకుని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

– డ్రగ్స్ నియంత్రణపై యుద్ధం అనివార్యం: కోరం కనకయ్య, ఇల్లందు ఎమ్మెల్యే

యువతను చిత్తుచేస్తున్న డ్రగ్స్‌పై యుద్ధం చేయడం అనివార్యమని ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో నెల రోజుల ప్రచార కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం యువతను, విద్యార్థులను మాదక ద్రవ్యాల (డ్రగ్స్) కోరల నుండి రక్షించడం అన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలు ముఖ్యంగా విద్యా సంస్థలు, కళాశాలల్లో పోలీసు అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులు, ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు, తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావడం గర్వకారణమన్నారు.

* పోలీసులతోపాటు ప్రతి పౌరుడు యుద్ధం చేయాలి: ఎస్పీ రోహిత్ రాజు

డ్రగ్స్ వాడకం అనేది వ్యక్తిగత సమస్య కాదని, ఇది సామాజిక రుగ్మత అని, దీనిపై పోలీసులతోపాటు ప్రతి పౌరుడు యుద్ధం చేయాలని ఎస్పీ రోహిత్ రాజు పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని ధైర్యంగా తమకు తెలియజేయాలని కోరారు. అనంతరం ఎస్పీ చేతుల మీదుగా అతిధులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కృష్ణ గౌడ్, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జిల్లా రవాణాధికారి వెంకటరమణ, సూపరింటెండెంట్ జానయ్య, మున్సిపల్ కమీషనర్ సుజాత, డిఎస్పీలు రెహమాన్, చంద్రభాను, రవీందర్ రెడ్డి, సతీష్‌కుమార్, మల్లయ్య స్వామి, అశోక్, సత్యనారాయణ, స్థానికులు, విద్యార్థులు, ప్రజాప్రతినిదులు, పుర ప్రముఖులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## రోడ్లపై, ఆలయాల వద్ద పేరుకపోయిన చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలి

* బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జె.కె శేఖర్ యాదవ్

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : రోడ్లపై , ఆలయాల వద్ద పేరుకపోయిన చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జె.కె శేఖర్ యాదవ్ అన్నారు. ఉదయం మార్నింగ్ వాకింగ్ లో భాగంగా వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారిలో, రింగుబస్తీ లో రోడ్ల పైన , ఆలయాల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించాలని డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు శుక్రవారం ఉదయం 6:30కు ఈ యొక్క ప్రదేశాలని సందర్శించి సంబంధిత జిహెచ్ఎంసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజు ఈ రోడ్ల వద్ద క్లీన్ గా ఉండాలని ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున



టెంపుల్ అధ్యక్షులు గండి రాజు యాదవ్, శ్రీకాంత్ యాదవ్, గోపాల్, జిహెచ్ఎంసి సిబ్బంది చారి, రాజు, వెంకటేష్ ,అభిషేక్ తదితరులు పాల్గొన్నారు

## మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం తోడ్పాటు

* ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ చేస్తుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం ముకుందాపురంలో మత్స్యకార సొసైటీ లకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ అన్ని వర్గాల పేద ప్రజలను వారి వారి రంగాల్లో ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. మత్స్యకార సొసైటీ సభ్యులు ఉచిత చేప పిల్లలను ఆరోగ్యకరంగా పెంచాలని సూచించారు. ఐదు పంచాయతీలకు సంబంధించిన మూడు సొసైటీలకు చేప పిల్లలను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే చేయూతను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో మత్స్యశాఖ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. చేపలను పెంచే చెరువుల్లో వ్యర్థ పదార్థాలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలదారులకు నిత్య అన్న ప్రసాద వితరణ





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్న ప్రసాద వితరణ ఐదో రోజు నిర్వహించారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వామి మలాదారులకు ఉసర్తి లక్ష్మి మోహన్ కృష్ణ దంపతుల కుమార్తెలు భవిష్య, నెహస్వి కృషికలు శుక్రవారం నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య అన్న ప్రసాద దాతలు మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు ప్రసాద వితరణ నిర్వహించడం తమ పూర్వ జన్మ సుకృతమని, తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అన్న ప్రసాద దాతల కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలని, అయురూ ఆరోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ నిర్వాహకులు తొర్పునూరి నర్సింహ గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, కళ్లెం నాగరాజు గౌడ్, చెవగోని మహేష్ గౌడ్, వరగంటి వెంకటేష్ గౌడ్, స్వాములు మార్గం శేఖర్ యాదవ్, అందోజు సన్నిధ్ చారి, పోల్దాస్ రాజు, చెరుకు రాము గౌడ్, దాసరి మురళిస్వామి, చెవగోని గణేష్‌గౌడ్, బందారపు శివగౌడ్, చెరుకు చైతన్య, తొర్పునూరి సాయి, తొర్పునూరి సాయిలుగౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు పగిడోజు సంతోష్ కుమార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ గెలుపుపై జోగిపేట లో కాంగ్రెస్ సంబరాలు



అందోలు,ప్రజాస్ఫూర్తి: జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుపొందడంతో జోగిపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. ఫలితాలు వెలువడగానే స్థానిక హనుమాన్ చౌరస్తాలో బాణా సంచాలు కాల్చి , వ్యాపారస్తులకు, కార్యకర్తలకు స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్నారు. ఈ సంధర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివరాజ్, మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు మాట్లాడుతూ ఈ ఫలితాలు బీఆర్ ఎస్ పార్టీకి, కేటీఆర్ అహంకారానికి చెంపపెట్టు అన్నారు. మంత్రి దామోదర్ ఇంచార్జి గా పని చేసిన ఎర్ర గడ్డ ఏరియాలో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలను గెలుచుకోవడం ఖాయమన్నారు. మాజీ కౌన్సిలర్, చిట్టిబాబు, శరత్ బాబు, ఆక్సన్ పల్లి సొసైటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, నాయకులు మధు సూధన్ రెడ్డి, డాకూరి శ్రీను, ఆత్మ డైరెక్టర్ లు చిట్యాల మధు, తుడుము యాదయ్య, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా సహకార వారోత్సవాలు

గుమ్మడిదల(జిన్నారం),ప్రజాస్ఫూర్తి : గుమ్మడిదల మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారోత్సవాలు ఘనంగా జరిగాయి. పిఏసీఎస్ చైర్మెన్ నంద్యాల విష్ణు వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వారోత్సవాలను నిర్వహించారు. కార్యాలయం ముందు జండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలు ఏర్పడి 72 సంవత్సరాలు గడుస్తుందని అన్నారు. పిఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు ఎంతో మేలు జరిగిందని, రాబోవు రోజుల్లో మరింతగా రైతులకు సేవలు అందుతాయని వెల్లడించారు.



# ప్రజా పాలనకు.. ప్రజలు పట్టం కట్టారు

*** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో నవీన్ యాదవ్ గెలుపుతో విజయోత్సవ సంబరాలు:**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజా ప్రభుత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు మెచ్చిన ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థికే పట్టం కట్టారని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మునుగోడు ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజులు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని చౌటుప్పల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. అంతకుముందు జాతీయ రహదారిపై విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు ప్రజలు పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ప్రతిపక్షాలకు చెంప పెట్టన్నారు. రెండు సంవత్సరాల కాలంలో అర్హులైన అందరికీ రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, రైతులకు మద్దతు ధర, 60వేలు ఉద్యోగాలు, ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ చేయడం కాంగ్రెస్ పార్టీకి చెల్లిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రజా ప్రభుత్వమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు పబ్బు శ్రీకాంత్ గౌడ్, ఎండీ గౌస్ ఖాన్, మాజీ కౌన్సిలర్లు కొయ్యడ సైదులు గౌడ్, సందగళ్ళ విజయ సతీష్ గౌడ్, కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, బాబా షరీఫ్, బొడిగే అరుణ బాలకృష్ణ గౌడ్, షాదిఖాన చైర్మన్ ఎండి కరీం, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్, రాచకొండ భార్గవ్, బొంగు జంగయ్య గౌడ్, నాయకులు చెరుకు లింగుస్వామి గౌడ్ బత్తుల విప్లవ గౌడ్, పెద్దగోని రమేష్ గౌడ్, అశ్విన్ గౌడ్, చెంచల శ్రీనివాస్, అర్ధ వెంకట్ రెడ్డి, మలిగే మల్లేష్, కంచరకుంట్ల రాంరెడ్డి, పస్తం గంగారాములు, బండమీది వెంకటేశం, మారగోని శేఖర్, బండమీద ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ నారాయణ పాఠశాలలో ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:పాల్వంచ నెహ్రూనగర్‌లోని నారాయణ పాఠశాలలో చిల్డ్రన్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు , వినోద కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎజిఎమ్ రాంకీ మాట్లాడుతూ, "విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వారి దాగిన ప్రతిభను వెలికి తీయడం, సృజనాత్మకతను అభివృద్ధి చేయడం లక్ష్యంగా నారాయణ యాజమాన్యం నిరంతరం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోంది" అని తెలిపారు. ఆర్ఐ క్రాంతి మాట్లాడుతూ, "విద్యార్థులకు ప్రేమ, ఆదరణ, సరైన దిశలో మార్గనిర్దేశం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ పూరేటి నరసింహరావు మాట్లాడుతూ "మా పాఠశాలలో చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తూ, విద్య విలువలతో కూడిన ఉత్తమ వాతావరణాన్ని అందించేందుకు సంకల్పబద్ధంగా ముందుకు సాగుతున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కోఆర్డినేటర్లు ప్రవీణ్ కుమార్, వినోద లక్ష్మి, నీలిమ, ఏడి రామకృష్ణ, ఈ-చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ శ్వేత, ఈ-కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ పద్మ, ఏవో వీర, పిఇటి వినయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా చిల్డ్రన్స్ డే, డయాబెటిస్ డే కార్యక్రమాలు..

**- జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ**




అందోలు, ప్రజాస్ఫూర్తి: జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం చిల్డ్రన్స్ డే,డయాబెటిస్ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అందోలు అంగన్వాడి కేంద్రంలో 20 మంది విద్యార్థులకు ఫ్రూట్ జ్యూస్, స్లేట్లు , బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం డయాబెటిస్ డే కార్యక్రమంలో భాగంగా స్థానిక విశ్రాంత భవనంలో రిటైర్డ్ ఉద్యోగులు 51 మందికి షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి. రవి శేఖర్ రెడ్డి, జిల్లా డయాబెటిస్ చైర్మన్ రామకృష్ణ, క్లబ్ మాజీ అధ్యక్షులు ఆర్. ప్రదీప్ గౌడ్, జి. ఆర్. మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి జీ. సంతోష్, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రేమ్ కుమార్, సభ్యులు నవీన్, రవీందర్, ప్రభాకర్ రెడ్డి, రాధాకృష్ణ గౌడ్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రినిటీలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ హై స్కూల్ ఐఐటి జోన్ లో బాలల దినోత్సవం సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల భారతదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉజ్జిని మంజుల మాట్లాడుతూ నెహ్రూ జన్మదిన వేడుకలను బాలల దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు నెహ్రూ వేషధారణ వేసి అలరించారు. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలో ఆకట్టుకున్నారు. విద్యార్థులచే సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఆట పాటలతో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు, ఉపాధ్యాయులు అనూష, చందన, జ్యోతి, శిరీష, అనసూయ, లావణ్య, సంతోష, రాణి, హారిక, రత్న, భార్గవి, సింధు తదితరులు పాల్గొన్నారు.




## జగద్గిరిగుట్టలో గంజాయిని నిర్మూలించేందుకు ప్రజల సహకారం అవసరం

*** జగద్గిరిగుట్ట సబ్ ఇన్స్పెక్టర్ నవీన్ రెడ్డి**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ప్రజల సహకారం తో జగద్గిరిగుట్టలో గంజాయిని నిర్మూలించడానికి పనిచేస్తామని జగద్గిరిగుట్ట సబ్ ఇన్స్పెక్టర్ నవీన్ రెడ్డి అన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా శుక్రవారం జగద్గిరిగుట్ట బస్టాప్ లో అఖిలపక్ష పార్టీల నాయకులు , బస్తీ కమిటీల నాయకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో మానవహారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగద్గిరిగుట్ట సబ్ ఇన్స్పెక్టర్ నవీన్ రెడ్డి హాజరై మాట్లాడుతూగంజాయి కి ఎక్కువగా విద్యార్థులు, యువకులు అలవాటు పడుతున్నారని దానికి ముఖ్య కారణం ఒత్తిడి, పని భారం, తల్లిదండ్రులు వారిని సరిగ్గా పట్టించుకోకపోవడం, చదువు లేకపోవడం లాంటి కారణాలన్నారు. గంజాయి ఆరోగ్యాన్ని పాడు చేయడమే కాకుండా సమాజంలో అశాంతిని సృష్టిస్తుందన్నారు. గంజాయి కి అలవాటు పడకుండా ఉండాలంటే చిన్నప్పటి నుంచే క్రీడల్లో పాల్గొంటే ఒత్తిడిని తట్టుకోగలుగుతారన్నారు. గంజాయి కి వ్యతిరేకంగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను ఇంకా చైతన్యవంతం చేసి జగద్గిరిగుట్టలో గంజాయి లేకుండా చేయాలన్నారు. జగద్గిరిగుట్టలో ఇలాంటి కార్యక్రమాన్ని ప్రజలు అఖిలపక్ష పార్టీల నాయకులు కలిసి స్వచ్ఛందంగా చేయడం ఒక మంచి ముందడుగు అని రానున్న రోజుల్లో కూడా గంజాయికి వ్యతిరేకంగా అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ ,సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, రాములు ప్రజానాట్య మండల అధ్యక్షుడు ప్రవీణ్, కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్, సాయి పంతుల, జనసేన అధ్యక్షుడు సతీష్, టిఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ సాజిద్ ,సోషల్ వర్కర్ చికిలే మధుబాబు, హెల్పింగ్ హార్ట్స్ విజయ్, ప్రజానాట్యమండలి బాబు,వివిధ బస్తీల నాయకులు సదానందం, ఖయ్యాం ,సాయిలు, రవీందర్ రెడ్డి బ్రహ్మానంద చారి ,వెంకటేష్, కుమారస్వామి, అరుణ్, పవన్ రెడ్డి, ప్రవీణ్, జార్జ్, క్యాబ్ అసోసియేషన్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్ చారి, శ్రీనివాస్ ఎం సిపిఐ నాయకులు రవీందర్ గౌడ్ మహిళా సమైక్య అధ్యక్షురాలు హైమావతి, త్రివేణి ,సరిత, ఇంద్ర, జయ, యువజన నాయకులు కీర్తి, వంశీ ,జంబు శ్రీనివాస్, వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు




## నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్

*** ఎంఎల్ఆర్ఐటి చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్ అని, వారిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంఎల్ఆర్ఐటి చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి అన్నారు. భారత దేశ తొలి ప్రధాని జవహార్ లాల్ నెహ్రూ 136వ పుట్టినరోజు ను పురస్కరించుకొని టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో" "బాలల దినోత్సవం" అంగరంగ వైభవంగా నిర్వహించారు. నెహ్రూ కి ఎంతో ఇష్టమైన చిన్నారుల తో ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్, చక్కటి నృత్యాలు వేసి చూపర్లను ఆకట్టుకున్నారు నేటి నుండి మూడు రోజులపాటు అన్ని పాఠశాలల ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా " ఎంఎల్ఆర్ఐటి చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి విచ్చేసి నృత్యాలను తిలకించి ఆనందించారు అనంతరం ఆయన చేతుల మీదుగా "బాల్ త్రో " ఆటను బాల్ విసిరి న తదుపరి టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి. కోటి రెడ్డి కూడా బంతిని వేసి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ బీపీఎస్ ఒలంపియాడ్ చింతల్, బీపీఎస్ ప్లే స్కూల్ సూరారం, టీవిఆర్ హైస్కూల్ చింతల్, టీవిఆర్ గీతాంజలి చింతల్ పద్మారావు నగర్, బీపీఎస్ రంగారెడ్డి నగర్,సత్యవాణి విద్యా నికేతన్ ఎస్ఆర్ నాయక్ నగర్, టీవిఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీ మొత్తం 7 స్కూల్స్ పోటీ పడనున్నాయి త్రో బాల్ ,రన్నింగ్ రేస్ ,రిలేరన్ ,చెస్ , చైనీస్ చేక్కర్, క్రికెట్ , కోనపన్ డౌన్ , బాల్ డ్రాయింగ్ విత్ హోప్, వకృత్వం , వ్యాసరచన, చిత్రలేఖనం ,వంటి ఆటలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్, కరస్పాండెంట్ అరుణకుమారి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీ పూర్ణిమ లు చిన్నారులకు 136వ జవహర్లాల్ నెహ్రూ జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు

## కృష్ణవేణిలో స్వపరిపాలన దినోత్సవం

**- ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కృష్ణవేణి పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించి తమతోటి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. ప్రధానోపాధ్యాయురాలిగా బి ధాత్రి, మండల విద్యాధికారిగా సిపిచ్ మనీష, కలెక్టర్‌గా బి సహస్ర, జిల్లా విద్యాధికారిగా పి శ్రీజలు వ్యవహరించారు. అనంతరం తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పాఠశాల డైరెక్టర్ గుత్త కవితగోపాల్ రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు..ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉయ్యాల రమేష్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, మన భారతదేశ భవిష్యత్తు అని జవహార్ లాల్ నెహ్రూ ఎల్లప్పుడూ అనేవారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిజాతం మొక్క నాటిన ప్రకృతి ప్రేమికులు, చిన్నారులు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొత్తగూడెం పట్టణం రామవరం క్లబ్ ఏరియాలో హరిత కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు, మన్ కీ బాత్, సింగరేణియన్ కే. ఎన్. రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకృతి హారిత దీక్షకురాలు సైనిక రజువా, ప్రత్యేక వేషధారణలో పాల్గొన్న చిన్నారులు ఆర్యన్, అదన్ సామ్యూన్, అనన్య, వైశాలి, శాన్వి, జాను, చిన్నిలతో కలిసి పారిజాతం మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ.. పట్టుదలతో.. ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

*** ఐరా స్కూల్ లో బాలల దినోత్సవ వేడుకలు**

*** అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

చౌటుప్పల్: క్రమశిక్షణ.. పట్టుదలతో.. చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఐరా పాఠశాల చైర్మన్ అరుణ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని ఐరా పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ శ్రీకాంత్ తో కలిసి పండిత్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిల్లలను అమితంగా ఇష్టపడే చాచా నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. విద్యార్థుల నాలుగు ఫోటోలు కావాలి భవిష్యత్తుకు పాఠశాల విద్య కీలకమన్నారు. కష్టపడి కాకుండా, ఇష్టపడే చదివాలని సూచించారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలన్నారు.

# ఎస్ ఆర్ స్కూల్లో ఘనంగా చిల్డ్రన్స్ వేడుకలు

* బాలలు భావి భారతావని స్వప్నాలు
* ఎస్ఆర్ స్కూల్ జోనల్ ఇంచార్జ్ దోనాలా శ్రీనివాస్ రెడ్డి ..



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : బాలలు భావి భారతావని స్వప్నాలని ఎస్ఆర్ స్కూల్ జోనల్ ఇంచార్జ్ దోనాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ నివాళులు అర్పించారు. నేటి బాలలే రేపటి పౌరులంటూ విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. సమాజంలోని చెడుకు పిల్లలు దూరంగా ఉండాలని అందుకు తల్లిదండ్రుల పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలని తెలిపారు. నేటి సమాజంలో విద్యార్థులను చెడు మార్గం వైపు ఉసిగొల్పుతున్న మొబైల్ ఫోన్స్‌కు దూరంగా విద్యార్థులు ఉండాలని తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూప, అధ్యాపక సిబ్బందితదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# నేటి బాలలే... రేపటి భారత భవిష్యత్తు

– కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకి చిన్నారులంటే ఎంతో ప్రేమ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగానే నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నమని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం బాబుక్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి లక్కినేని ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు అంతా నేటి చిన్నారుల చేతుల్లోనే ఉందని, వారికి మంచి విద్య, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం మనందరి సామాజిక బాధ్యత అని అన్నారు. అనంతరం బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి. నిరంజన్ రావు, ప్రధానోపాధ్యాయురాలు నీరజ, అడ్వకేట్ మారపాక రమేష్, పారా లీగల్ వాలంటీర్ బి.రాజమణి, ఉపాధ్యాయులు దస్తగిరి, చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# పేద విద్యార్థుల కు చేయూతనందించేందుకు దాతలు ముందుకు రావాలి

* సోమయ్యనగర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్రబోస్ రెడ్డి

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : పేద విద్యార్థుల కు చేయూతనందించేందుకు దాతలు,స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సోమయ్యనగర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్రబోస్ రెడ్డి అన్నారు.శుక్రవారం బాలల దినోత్సవం పురస్కరించుకొని హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో దాత వై.శ్రీనివాస్(సాయి సంజీవని జనరిక్ మెడికల్ హాల్)సహకారంతో గడచిన 202425 సంవత్సరం పదో తరగతిలో టాపర్లు గా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు సొసైటీ సభ్యులు,పాఠశాల అధ్యాపక బృందంతో కలిసి నగదు బహుమతులు అందజేశారు.మొదటి ర్యాంక్ సాధించిన అంకిత్ కుమార్ కు (545 మార్కులు రూ.2,500),రెండవ ర్యాంక్ సాధించిన బి.నరసింహ కు(542 మార్కులు రూ.2,000)మూడవ ర్యాంక్ సాధించిన భార్గవి కి (541 మార్కులు 1,500)ల నగదు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించిన దాత శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే,యువ నాయకులు సాయికుమార్ పంతుల,హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ సభ్యులు డాక్టర్.సత్యనారాయణ, సయ్యద్ సాజిద్,వంపు మల్లేష్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

# వైష్ణవి టెక్నో స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : భారత దేశ తొలి ప్రధాని పండిట్ జవహార్ లాల్ నెహ్రూ 136వ జయంతి సందర్భంగా శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్ పురి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులు చాచా నేహ్రు వేషధారణలతో అకట్టుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్ర మాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ పాల్గొని పండిట్ జవహార్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసినివాళ్ళులర్పించి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు, వారు భావి భారతావనికి స్వప్నాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి బంగారు భవిష్యతు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శిల్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి విజయోత్సవ సంబరాలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయ దుందుభి మోగించి డబుల్ సెంచరీ సీట్లు సాధించడం పట్ల చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం బిజెపి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. జాతీయ రహదారిపై బాణాసంచా పేల్చారు. ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు దేశానికి బిజెపి నాయకత్వం అవసరమని, ఆ అవసరాన్ని దేశ ప్రజలు తప్పకుండా ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకే బిజెపి ప్రతి ఎన్నికల్లో విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్,, మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్,, జిల్లా కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రమణగోని శంకర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, పోలోజు శ్రీధర్ బాబు, చినుకని మల్లేశం, ఉబ్బు బుచ్చయ్య, ఊడుగు యాదయ్య గౌడ్, కట్ట కృష్ణ, కడారి ఐలయ్య యాదవ్, వనం ధనంజయ, ఎడ్ల మహేశ్వర్ రెడ్డి, గోశిక మురళి, దేవరకొండ కనకాచారి, తోకల సాయికుమార్, ఆల్మాస్పేట గౌతమ్, వరగంటి భాను ప్రకాష్, బోయ సదానందం, బాతరాజు గణేష్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పంచశీల స్కూల్ లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : భారత దేశ తొలి ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం మూసా పేట లోని పంచశీల స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. దేవర్స్ ఫౌండేషన్, పంచశీల స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలలో తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, ప్రముఖ బ్యాడ్మెంటన్ ప్లేయర్, అర్జున అవార్డు గ్రహీత పారుపల్లి కశ్యప్ లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు బ్యాగ్స్, బొమ్మలు అందజేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒంటరి పేరెంట్స్ చిన్నారులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్ డిల్లీశ్వరి, పాఠశాల కార్పొండెంట్ పంచశీల శ్రీనివాస్, అనిత తదితరులు పాల్గొన్నారు.





# ఇదో గుణపాఠం.. కాంగ్రెస్‌కు కొత్త వ్యూహాలు అవసరం: డీకే శివకుమార్

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష 'ఇండియా' కూటమి (మహాగఠ్‌బంధన్)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పెద్దఎత్తున సీట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే బిహార్ ఫలితాలపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. భవిష్యత్తు ఎన్నికల కోసం కాంగ్రెస్‌తోపాటు 'ఇండియా' కూటమి కొత్త వ్యూహాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. తాజా ఫలితాలను తమ పార్టీకి, మిత్రపక్షాలకు ఓ గుణపాఠంగా పేర్కొన్నారు. ''బిహార్ ఫలితాలు.. ప్రజలు ఇచ్చిన తీర్పు. మాకు ఒక గుణపాఠం లాంటిది. కాంగ్రెస్ పార్టీకి, 'ఇండియా' కూటమికి కొత్త వ్యూహాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. దీని కోసం కసరత్తు చేస్తాం'' అని డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడారు. బిహార్‌లో మహిళల ఓట్ల శాతం పెరుగుదల, వారికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం వంటివి ఎన్డీయే విజయానికి దోహదం చేశాయా? అనే ప్రశ్నపై బదులిస్తూ.. ''దీన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. నా వద్దకు ఇంకా వివరణాత్మక నివేదిక రాలేదు. తర్వాత మాట్లాడతాను'' అని చెప్పారు.

* 'ఎస్ఐఆర్'దే అసలు ఆటంతా...: అఖిలేశ్ యాదవ్

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ద్వారా మొత్తం ఆట నడిపించారంటూ ఎన్డీయేపై ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపణలు చేశారు. ఈ ఎన్నికల కుట్ర ఇప్పుడు బయటపడినందున.. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఇది సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. ఇకపై వారి ఆటలు సాగనివ్వబోమన్నారు. ''సీసీటీవీ మాదిరి మా వద్ద 'పీపీటీవీ' ఉంది. 'పీడీఏ ప్రహరీ టీవీ' (పీడీఏ కాపలాదారు టీవీ) అప్రమత్తంగా ఉండి భాజపాను అడ్డుకుంటుంది'' అని ట్వీట్ చేశారు.

# ఎర్రచందనం స్మగ్లర్లను వెంటాడిన గ్రామస్తులు :స్పందించిన పవన్ కల్యాణ్



ఎర్రచందనం అక్రమ రవాణాపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఆయన అందిస్తున్న భరోసా ప్రజల్లో చైతన్యం నింపుతోంది. పవన్ కల్యాణ్ స్ఫూర్తితో చిత్తూరు జిల్లా, అప్పినపల్లి గ్రామస్తులు ఎర్రచందనం దొంగల ఆటకట్టించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకుని దుంగలను అటవీశాఖ అధికారులకు పట్టించారు. అక్రమంగా రవాణా చేస్తున్న 10 ఎర్రచందనం దుంగలను, ఆ గ్రామ ప్రజల సహకారంతో శుక్రవారం ఉదయం అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో సహకరించిన అప్పినపల్లి గ్రామస్తులను పవన్ అభినందించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పవన్ తీసుకుంటున్న చర్యలకు తమవంతు సహకారం అందించాలన్న ఉద్దేశంతోనే దుంగల దొంగల వాహనాన్ని వెంబడించినట్టు అప్పినపల్లి గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం ఉదయం తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ పులిచర్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక టవెరా వాహనం అనుమానాస్పదంగా దూసుకువెళ్లింది. అటవీ అధికారులు ఆ వాహనాన్ని వెంబడించగా, వారు బెంగళూరు వైపు వేగంగా వెళ్లిపోయారు. మార్గమధ్యంలో వాహనం నుంచి దూకి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. వాహనంలో ఉన్న డ్రైవర్ వేగంగా నడుపుకొంటూ ముందుకు వెళ్లాడు. అటవీ శాఖ అధికారులు ఇచ్చిన సమాచారంతో చిత్తూరు జిల్లా, అప్పినపల్లి గ్రామస్తులు ఆ వాహనాన్ని వెంబడించారు. దీంతో డ్రైవర్ కూడా వాహనాన్ని ఒక పక్కన ఆపి పారిపోయాడు. అటవీశాఖ అధికారులు, పోలీసులు ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అక్రమంగా 10 ఎర్రచందనం దుంగలు దొరికాయి. సమాచారాన్ని అటవీ అధికారులు ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ఎర్ర చందనం దొంగల ఆటకట్టించే క్రమంలో గ్రామస్తులు చూపిన చొరవ, ధైర్యాన్ని పవన్ కల్యాణ్ మెచ్చుకున్నారు. అటవీశాఖ అధికారులు, పోలీసులను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఈ క్రమంలో నేడు(శుక్రవారం) శ్రీవారి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది.. ఈ తరుణంలో శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు 24 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. తిరుమల భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని టీటీడీ అధికారులు తెలిపారు. క్యూలైన్‌లోని భక్తులకు శ్రీవారి సేవకుల ద్వారా అన్నప్రసాదం, పాలు, తాగునీరు అందిస్తున్నారు. నిన్న(గురువారం)శ్రీవారిని 62,129 మంది భక్తులు దర్శించుకున్నారు. 21,026 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.13 కోట్లు వచ్చిందని టీటీడీ(TTD) అధికారులు తెలిపారు.

# తెలంగాణకు వచ్చే డిసెంబర్ 9వ తేదీ చాలా కీలకం: CM రేవంత్

తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 8 వ తేదీన రెండో వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధికి సాధించాలన్న లక్ష్యంతో రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 దార్శనిక పత్రాన్ని వచ్చే డిసెంబర్ 9 వ తేదీన ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావొస్తున్న నేపథ్యాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రోడ్ మ్యాప్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహణ తదితర అంశాలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం రూపొందించే పాలసీ ఆధారంగానే భవిష్యత్తు నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని, విధానపరమైన ప్రణాళిక



ఉంటే పెట్టుబడిదారులకు ఒక స్పష్టత వస్తుందని చెప్పారు. పాలసీ డాక్యుమెంట్ ప్రభుత్వంలోని శాఖల వారిగా ఉండాలని, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో ఆయా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులోగా శాఖల వారిగా పాలసీ డాక్యుమెంట్ సిద్ధం కావాలని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు, సంబంధిత ఇతర అంశాలపై ఎప్పటికప్పుడు ఉప ముఖ్యమంత్రి సమీక్షలు నిర్వహిస్తారని, సమ్మిట్‌ను విజయవంతం చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్‌కు వివిధ దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించాలని, అలాగే అందుకు తగిన విధంగా భద్రత విషయంలో కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, డీజీపీ శివధర్ రెడ్డితో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## ఫ్యాన్సీ నంబర్ల వేలం..
## రవాణాశాఖకు రూ.65 లక్షల ఆదాయం

హైదరాబాద్: ఫ్యాన్సీ నంబర్లు రవాణాశాఖకు కాసులు కురిపిస్తున్నాయి. ఒక్కరోజులోనే ఖైరతాబాద్ రవాణాశాఖ కార్యాలయానికి రూ.65,38,889ల ఆదాయం వచ్చినట్లు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ రమేష్ తెలిపారు. అత్యధికంగా TG09H 9999 నంబరు రూ.22,72,222లు పలికింది. అతి తక్కువగా TG09J0003 నంబరుకు రూ.1,15,121ల ఆదాయం వచ్చింది.

* TG09H 9999 నంబరు రూ.22,72,222లకు హనర్ ప్రైమ్ హౌసింగ్ ఎల్ఎల్‌పీ అధినేతలు కైవసం చేసుకున్నారు.
* TG09J 0009 .. రూ.6,80,000లకు మెస్సర్స్ దండు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం దక్కించుకుంది.
* TG09J 0006.. రూ.5,70,666లకు సాయి సిల్క్స్ కళామందిర్ లిమిటెడ్ యాజమాన్యం దక్కించుకున్నారు.
* TG09J 0099 .. రూ. 3,40,000లకు మెస్సర్స్ గోదావరి ఫార్చ్యూన్ సంస్థ దక్కించుకుంది.
* TG09J 0001 ... రూ.2,60,000లకు శ్రీనిధి ఐటీ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కైవసం చేసుకుంది.
* TG09J 0005 .. రూ.2,40,100లకు నిహారిక ఎంటర్ టైన్ మెంట్ సంస్థ దక్కించుకుంది.
* TG09J 0018 .. రూ.1,71,189లకు రోహిత్ రెడ్డి ముత్తు కైవసం చేసుకున్నారు.
* TG09J 0007 .. రూ.1,69,002లకు కొండవరపు శ్రీనివాస్ నాయుడు తీసుకున్నారు.
* TG09J 0077 .. రూ.1,41,789ల ఆదాయం సమకూరింది. ఈ నంబర్ ను మీనాక్షి పవర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కైవసం చేసుకుంది.
* TG09J 0123 .. రూ.1,19,999ల ఆదాయం వచ్చింది. ఈ నంబర్‌ను ఆకుల మాధురి దక్కించుకున్నారు.
* TG09J 0003 .. రూ.రూ.1,15,121లకు జీ.ఎస్.ఆర్ కన్ స్ట్రక్షన్స్ సంస్థ కైవసం చేసుకుంది.




### తెలంగాణ పోలీసు శాఖలో
## 60 పోస్టులకు నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్: తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీలో 60 పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయింది. సైంటిఫిక్ ఆఫీసర్స్, సైంటిఫిక్ అసిస్టెంట్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, ల్యాబ్ అసిస్టెంట్స్ పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 27 నుంచి డిసెంబరు 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నోటిఫికేషన్ పూర్తి వివరాల కోసం https://www.tgprb.inలో చూడాలని అధికారులు తెలిపారు.

## జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారు: టీపీసీసీ చీఫ్

నిజామాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. 25 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ జయకేతనం ఎగరవేశారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ‘‘జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారు. ఈ విజయం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అంకితం. జూబ్లీహిల్స్ తీర్పుతో ప్రజలు BRS పార్టీకి సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో ఆ పార్టీకి చోటులేదని మరోసారి రుజువైంది. రానున్న రోజుల్లోనూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన కొనసాగుతుంది. నవీన్‌ను గెలిపించిన ఘనత.. సీఎం, మంత్రులు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తది’’ అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.



## ఫుడ్ ఎకోసిస్టమ్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం: శ్రీధర్‌బాబు

ఆధునిక, స్థిరమైన, ఆవిష్కరణలకు ప్రాధాన్యత నిచ్చే ఫుడ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. దక్షిణ భారతదేశంలో ప్రముఖ ఆహార పానీయ (ఫుడ్ అండ్ బేవరేజ్) ట్రేడ్ ఫెయిర్‌గా గుర్తింపు పొందిన ఫుడ్ ఎ ఫేర్ 2025 నగరంలోని హైటెక్స్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఫెయిర్‌ను మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్, పారిశ్రామిక వేత్తల అభివృద్ధి, టెక్నాలజీ అనుసరణ, మార్కెట్ అభివృద్ధి వంటి కీలక రంగాల్లో దృష్టి సారించడం ద్వారా ఆహార వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు రాష్ట్రాన్ని ప్రధాన కేంద్రంగా నిలపడమే తమ లక్ష్యంగా పేర్కొన్నారు. హైదరాబాద్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన అడుగుగా ఈ ఫుడ్ ఎ ఫెయిర్ నిలుస్తోందన్నారు. రిటైలర్లు,



హోల్ సెల్లర్లు, తయారీదారులు, ఫుడ్ ప్రాసెసర్లు, టెక్నాలజీ ఇన్నోవేటర్లు, షెఫ్స్, వంట నిపుణులు, స్టార్టప్‌లు, కొనుగోలుదారులు అంతా ఒకే వేదికపైకి రావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమం నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎడిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఫుడ్ ఎ ఫెయిర్ కలినరీ కార్నర్‌ను మొదటిసారి ప్రవేశపెట్టామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ షెఫ్స్ లైవ్ కుకింగ్ డెమోస్, ప్రత్యేకంగా ఎంపిక చేసిన టేస్టింగ్ సెషన్లు, ప్రాంతీయ వంటకాల వైభవ ఆవిష్కరణలను చక్కటి వేదికగా నిలుస్తుందన్నారు. ఆధునిక వ్యాపారం, ఫుడ్ ఇన్నోవేషన్, విలువ పెంపు, మార్కెట్ యాక్సెస్ మధ్య గల దూరాలను తగ్గిస్తూ, కొత్త ట్రెండ్లు, టెక్నాలజీలు, వ్యాపార అవకాశాలను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో ఈ ఫెయిర్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 16వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బి2బి మీటింగులు, ప్రొడక్ట్ లాంచ్‌లు, డిమాన్ స్ట్రేషన్స్, ఇండస్ట్రీ ఇంటరాక్షన్లు ఉంటాయని వెల్లడించారు. బ్లిట్జ్ ఎగ్జిబిషన్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఫెయిర్‌కు తెలంగాణ ప్రభుత్వ ఎమ్ఎస్ఎమ్ఈ శాఖ, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, తెలంగాణ షెఫ్స్ అసోసియేషన్ సహకారం అందిస్తున్నాయని చెప్పారు. అలాగే వైబ్రంట్ ఇండియా, హైటెక్స్‌లు కూడా నిర్వహణలో భాగం పంచుకుంటున్నాయని వివరించారు. కాగా.. ఈ ఫెయిర్‌లో కొలువుదీరిన వినూత్న ఉత్పత్తులు, విశేషాలు ఆకట్టుకున్నాయి. వీటిలో ప్లాంట్ బేస్డ్ ఆహార పదార్థాలు, ఆర్గానిక్ అండ్ మిల్లెట్ ఆధారిత ఉత్పత్తులు, ఫంక్షనల్ ఫుడ్స్, తాజా వ్యవసాయ ఉత్పత్తులు, ఫ్రోజెన్ ఫుడ్స్, పాలు అండ్ పాల ఆధారిత పదార్థాలు, మసాలాలు, రెడీ టు ఈట్ ఉత్పత్తులు వంటివి ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాడ్మింటన్ చీఫ్ నేషనల్ కోచ్, పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్, ఐసీఏఆర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ డైరెక్టర్ డా.తారా సత్యవతి, ప్రిన్సిపల్ సైంటిస్ట్, న్యూట్రిహబ్ సీఈఓ జె.స్టాన్లీ, మిల్లెట్ బ్యాంక్ ఫౌండర్ విశాలరెడ్డి, ప్రగతి గ్రూప్ చైర్మన్ జీబీకే రావు తదితరులు పాల్గొన్నారు.

## గత ఏడాది 3 వేల రోడ్డు ప్రమాదాలు..
### యాక్సిడెంట్లపై డీజీపీ కీలక వ్యాఖ్యలు

రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో జీవితాలు ఆగం అవుతున్నాయని, రోడ్డు ప్రమాదాల నివారణకు యువత ముందడుగు వేయాలని డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. గత సంవత్సరంలో సుమారు 3 వేల యాక్సిడెంట్లు జరగగా, అందులో 300 మంది మరణించారని, కుటుంబాలను కన్నీరు పెట్టనివ్వదని తెలిపారు. మద్యం తాగి నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి కారణాల వల్లనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అవగాహనపై హైదరాబాద్ కమిషనర్ సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో చెపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. ప్రజలందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించడం దినచర్యగా చేసుకోవాలన్నారు. ‘అరైవ్ అలైవ్’ సందేశాన్ని ప్రతి ఒక్కరు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి వాతావరణ పరిస్థితిలలోనైనా, విపత్తులలోనైనా హైదరాబాద్ పోలీసులు ఫ్రంట్ లైన్‌లో ఉండి పోరాడుతున్నారని ప్రశంసించారు. దేశంలోనే హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు మంచి పేరు ఉందన్నారు. ముఖ్యంగా, అవయవాలను తరలించడంలో (గ్రీన్ ఛానెల్) ముందున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన కలిగించేందుకు సినీ ప్రముఖులను ఆహ్వానించారు.

*** మాకు మాత్రం శోకం మిగిలింది: బాబు మోహన్**

సినీ నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్ మాట్లాడుతూ.. తన కుమారుడు, సినీ నటుడు కోట శ్రీనివాస రావు కుమారుడు ఇద్దరూ కూడా రోడ్డు ప్రమాదంలో మరణించారని గుర్తు చేశారు. రెండు దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ ఈ ఘటన బాధిస్తుందని మీ కుటుంబాలకు అలాంటి పరిస్థితి రానివ్వకూడదని తెలిపారు. కోట శ్రీనివాస రావుతో కలిసి ఎన్నో సినిమాల్లో ప్రేక్షకులని నవ్వించామని మా కుటుంబాలకు రోడ్డు ప్రమాదాల రూపంలో శోకం మిగిలిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించే విషయంలో పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని సినీ డైరెక్టర్ బుచ్చిబాబు తెలిపారు. కారు నడిపే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ వేసుకోవాలని డైరెక్టర్ సుకుమార్ తనతో సీట్ బెల్ట్ వేసుకోవాలని ప్రామిస్ చేయించుకున్నారని విషయం పంచుకున్నారు. ప్రతి ఒక్కరు భద్రత (సేఫ్టీ) నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సినీ హీరోలు శర్వానంద్, ఆది సాయి కుమార్, సినీ హీరోయిన్ అర్చన, గాయకులు నాగూర్ బాబు, మోహనా భోగరాజు తదితరులు పాల్గొన్నారు.

## హాక్‌బ్రిడ్జ్ హెవిటిక్, ఈసన్ కంపెనీల ఆస్తులు జప్తు చేసిన ఈడీ

*** రూ.111.57కోట్ల స్థిరాస్తుల తాత్కలికంగా జప్తు**

*** విక్టరీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌కు కేసులో జప్తు**

విక్టరీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌కు సంబంధించి మనీలాండరింగ్ కేసులో హాక్‌బ్రిడ్జ్ హెవిటిక్, ఈసన్ లిమిటెడ్‌కు చెందిన రూ.111.57 కోట్ల విలువైన స్థిరాస్తులను తాత్కాలికంగా జప్తు చేసినట్లు హైదరాబాద్ ఈడీ జోనల్ కార్యాలయం అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఎస్‌బీఐ స్ట్రెస్డ్‌అసెట్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్ ఫిర్యాదు మేరకు సీబీఐ 2023లో నమోదు చేసిన కేసు ఆధారంగా




ఈడీ దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. విక్టరీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, విక్టరీ ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ స్విచ్‌గేర్స్ లిమిటెడ్ ( వీటీఎస్ఎల్) సంస్థలకు అనుబంధంగా హాక్‌బ్రిడ్జ్ హెవిటిక్, ఈసన్ లిమిటెడ్ సంస్థ వ్యవహరించినట్లు వెల్లడించారు. వీటీఎస్ఎల్, డైరెక్టర్లు మహీంద్రా కుమార్, మనోజ్ కుమార్, వెంకటప్ప నాయుడు ఇతరులపై సీబీఐ కేసు నమోదు చేసి ఛార్జ్ షీట్ దాఖలు చేసినట్లు వెల్లడించారు. ఎస్ బీఐ నుంచి రూ.136.50 కోట్ల రుణాలను తప్పుడు పత్రాలు సమర్పించి తీసుకున్నట్లు, వాటిని షెల్ కంపెనీలకు మళ్ళించడం ద్వారా బ్యాంక్‌కు నష్టం వాటిలినట్లు పేర్కొన్నారు. ఎస్‌బీఐకి మొత్తం నష్టం రూ. 189.04 కోట్లు (వడ్డీతో సహా)వాటిల్లిందని పేర్కొన్నారు. విక్టరీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌కు చెందిన ఆస్తులు అందుబాటులో లేకపోవడంతో అనుబంధంగా వ్యవహరించిన సంస్థల ఆస్తులు జప్తు చేసినట్లు తెలిపారు.

## బీపీటీ, బీఎస్సీ ఎంఎల్టీ, అల్లైడ్ హెల్త్ కోర్సులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు పెంపు

కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ (కేఎన్‌ఆర్ యూహెచ్ఎస్) బీపీటీ, బీఎస్సీ ఎంఎల్టీ, బీఎస్సీ అల్లైడ్ హెల్త్ సైన్సెస్ కోర్సులలో 202526 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువును పొడిగించింది. ఇంతకుముందు ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే రిజిస్ట్రేషన్లకు చివరి తేదీగా ప్రకటించారు. ఇప్పుడు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని యూనివర్సిటీ ప్రకటించింది. యూనివర్సిటీలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశం కోరుకునే అభ్యర్థులు వెబ్‌సైట్ https://alliedhs.tsche.in ద్వారా నిర్దేశిత గడువులోపు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసి, అవసరమైన సర్టిఫికేట్లు అప్‌లోడ్ చేయాలని యూనివర్సిటీ సూచించింది. రిజిస్ట్రేషన్ లేదా అప్లికేషన్ సబ్మిషన్‌లో సాంకేతిక సమస్యలు ఎదురైతే 9392685856, 7842136688, 9059672216 నంబర్లకు సంప్రదించవచ్చు. వెబ్ ఆప్షన్లకు సంబంధించిన టెక్నికల్ ఇష్యూల కోసం tsparamed.tech@gmail.com కు మెయిల్ చేయొచ్చు.

# చీరకి తోడు... వెచ్చని బ్లవుజు!

ఉన్నపళంగా చలి చుట్టు ముట్టేసింది. చలికోటులోనో, వెచ్చగా దుప్పటిలోనో దాక్కోవాలి అనిపిస్తోంది కదూ! ఓవైపు వేడుకలు, మరోవైపు పెళ్లి పిలుపులు... కొన్నింటిని దాటవేసినా తప్పనిసరివి అంటూ కొన్ని ఉంటాయిగా! అక్కడికీ ఏ స్వెటర్‌లోనో శాలువా కప్పుకొనో ఏం వెళతాం? పైగా ముఖ్యమైన వేడుకలంటే చీర కట్టేయాల్సిందే! అబ్బబ్బా ఎన్ని తిప్పలో. అందుకే శీతకాలంలో వేడుకలు మనకి పెద్ద సవాలులా తోస్తాయి. స్టెలిష్ లుక్ ఇస్తూనే మేనికి వెచ్చదనాన్నీ ఇచ్చే వీలుంటే ఎంత బాగుంటుందో కదా! అయితే 'ఉలెన్ బ్లవుజు'లకు ఓటేయండి. లంగాఓణీ, లెహెంగా, చీర... వేటికైనా ఇవి చక్కగా నప్పుతాయి. పైగా సంప్రదాయ వస్త్రాలకు కొత్త లుక్‌నీ తెచ్చిపెడతాయి. వీటిలోనూ ఫుల్‌స్లీవ్, హైనెక్, కాలర్, బోట్‌నెక్, లాంగ్ బ్లవుజు... ఇలా బోలెడు రకాలున్నాయి. ప్రత్యేకంగా షిమ్మర్‌వీ, జ్యూయెల్, డిజైనర్ రకాలూ దొరికేస్తున్నాయి. బటన్, జిప్, టీషర్ట్ మోడల్ రకాల గురించైతే చెప్పనక్కరే లేదు. ప్రతిదీ స్మార్ట్‌గా ఆలోచించే అమ్మాయిలకు వేడుకల వేళ ఈ బ్లవుజులు స్మార్ట్ ఎంపికే కదూ! పైగా సిల్క్, నెట్, పట్టు, నేత ఏ రకమైన చీరకైనా ఇవి నప్పేస్తాయి. సౌకర్యం అదనం. చలి నుంచి కాపాడటంతోపాటు మీ సంప్రదాయ వస్త్రధారణకు అదనపు హంగు. ఇంకేం అప్‌గ్రేడ్ అయిపోండి. మెచ్చిన రంగులో ఉలెన్ బ్లవుజ్ తెచ్చిపెట్టుకోండి. మీదైన పర్‌ఫెక్ట్ లుక్‌ని రూపొందించుకోండి. వేడుకేదైనా వెచ్చగా సిద్ధమైపోండి. ఇంతకీ వీటిలో మీ ఎంపికేది మరి?









# ఉద్యోగుల మధ్య కమ్యూనికేషన్‌ని పెంచే 'జపనీస్' మంత్ర!

**ప్రస్తుత కార్పొరేట్ పని సంస్కృతిలో టీమ్‌వర్క్ పాత్ర కీలకం. మరి, బృందంతో కలిసి పనిచేయాలంటే కమ్యూనికేషన్ ముఖ్యం. ఉద్యోగుల మధ్య దీన్ని పెంపొందించడానికి సంస్థలు వివిధ రకాల పద్ధతుల్ని పాటిస్తుంటాయి. బృంద సమావేశాలు ఏర్పాటుచేయడం, క్రీడలు/సాంస్కృతిక పోటీలు నిర్వహించడం, టీమ్ లంచ్/డిన్నర్.. వంటి వాటికి తీసుకెళ్లడం.. ఇలా ఎవరి వ్యూహాలు వారివి! అయితే ఉద్యోగుల మధ్య కమ్యూనికేషన్‌ని పెంచడానికి జపనీస్ సంస్థలు మాత్రం 'HoRenSo' అనే ప్రత్యేక పద్ధతిని పాటిస్తాయట! ముచ్చటగా మూడు సూత్రాలతో మిళితమైన ఈ పద్ధతి ద్వారా ప్రత్యక్షంగా ఉద్యోగుల మధ్య కమ్యూనికేషన్ పెరగడంతో పాటు పరోక్షంగా సంస్థ ఉత్పాదకత మెరుగయ్యేందుకూ ఇది దోహదం చేస్తుందంటున్నారు అక్కడి నిపుణులు. మరి, ఇంతకీ ఏంటీ వ్యూహం? దీనివల్ల పని ప్రదేశంలో అటు ఉద్యోగులకు, ఇటు సంస్థకు చేకూరే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం రండి..**

ఆరోగ్యం, ఫిట్‌నెస్, లైఫ్‌స్టైల్.. ఇలా ప్రతి విషయంలోనూ జపనీయులు పాటించే సూత్రాలు ఎంతోమందిలో స్ఫూర్తి నింపుతుంటాయి. అందుకే ఏరి కోరి మరీ వాటిని పాటించేస్తుంటారు చాలామంది. ఇవే కాదు.. పని ప్రదేశంలో జపనీయులు పాటించే సూత్రాల్నీ కొన్ని సంస్థలు అలవర్చుకున్నాయి. వీటిలో 'HoRenSo' పద్ధతి ఒకటి. ఆఫీస్‌లో పనిచేసే ఉద్యోగుల మధ్య కమ్యూనికేషన్‌ని పెంచి.. టీమ్‌వర్క్‌ని మెరుగుపరిచేందుకు ఈ పద్ధతి ప్రభావవంతంగా పని చేస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు.



## ఇదే కమ్యూనికేషన్ సీక్రెట్!

'HoRenSo' అనేది Houkoku, Renraku, Soudan.. అనే మూడు సూత్రాల సమాహారమట.

* Houkoku అంటే చేసే పని గురించి పై అధికారులకు ఎప్పటికప్పుడు రిపోర్ట్ చేయడం. చేసే పనికి సంబంధించిన ఆలోచనలు, వీటిని పూర్తిచేసే క్రమంలో ఎదుర్కొనే సవాళ్లుసమస్యలు, వీటికి సంబంధించిన అప్‌డేట్స్.. ఇలా ఎప్పటికప్పుడు వాళ్లకు తెలియజేయాల్సి ఉంటుంది. దీనివల్ల చేపట్టిన ప్రాజెక్ట్‌కి సంబంధించిన పురోగతి గురించి యాజమాన్యానికి తెలిసే అవకాశం ఉంటుంది.
* కొన్ని ప్రాజెక్టులు పూర్తి కావాలంటే వివిధ విభాగాలు కలిసి పనిచేయాల్సి ఉంటుంది. అయితే వీళ్ల మధ్య పని పరంగా ఎలాంటి అపార్థాలు చోటుచేసుకోకుండా, పనికి సంబంధించిన సమాచారమంతా అన్ని విభాగాలకు పారదర్శకంగా, స్పష్టంగా అందేలా చేయడమే 'Renraku' పద్ధతి ముఖ్యోద్దేశం! అది చేసే పనికి సంబంధించిన అప్‌డేట్స్ కావచ్చు, మార్పులు చేర్పులు కావచ్చు.. సవాళ్లుసమస్యలు కావచ్చు.. ఇలా ఏ విషయంలోనైనా ఉద్యోగులకు పూర్తి స్పష్టత ఉంటుంది. పరోక్షంగా వాళ్ల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందిస్తుంది.



* చేసే పనికి సంబంధించిన అంతిమ నిర్ణయాలు యాజమాన్యమే తీసుకోవడం చాలా సంస్థల్లో మనం చూస్తుంటాం. అయితే జపనీస్ సంస్థలు ఈ విషయంలో ఉద్యోగుల్నీ భాగం చేస్తాయట! ఆయా పనులకు సంబంధించి తమకెదురైన సమస్యల్ని పైఅధికారులు, సహోద్యోగులతో చర్చించే అవకాశం కల్పించడం, వీటిని పరిష్కరించే క్రమంలో వాళ్ల నుంచి తగిన సలహాలు తీసుకోవడం.. ఇవన్నీ పరిగణనలోకి తీసుకొని కలిసి కట్టుగా అంతిమ నిర్ణయం తీసుకోవడానికే అక్కడి సంస్థలు మొగ్గు చూపుతాయట! 'Soudan'గా పిలిచే ఈ పద్ధతి వల్ల అత్యుత్తమ నిర్ణయాలు తీసుకోగలమని జపనీయులు నమ్ముతారట! ఇలా అందరూ కలిసి కట్టుగా పనిచేయడం వల్ల ఉద్యోగుల మధ్య కమ్యూనికేషన్ పెరుగుతుందని అక్కడి నిపుణులు చెబుతున్నారు.

## ఉన్నతి.. ఉత్పాదకత!

* పని ప్రదేశాల్లో 'హోరెన్‌సో' పద్ధతిని పాటించడం వల్ల అటు ఉద్యోగులకు, ఇటు సంస్థలకు బహుళ ప్రయోజనాలు చేకూరతాయని నిపుణులు చెబుతున్నారు.
* ఆయా పనుల గురించి ఎప్పటికప్పుడు సహోద్యోగులు, పైఅధికారులతో చర్చించడం వల్ల చేసే పనిపై ఆసక్తి, ఉత్సాహం పెరుగుతాయి. ఇది ఉద్యోగుల కెరీర్ ఉన్నతికి దోహదం చేస్తూనే.. సంస్థ ఉత్పాదకతనూ పెంచుతుంది.
* ఇలా అందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్ల.. పని విషయంలో కమ్యూనికేషన్ లోపాలు తలెత్తకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు.
* ఇలా ఎవరికి వారు పని పరంగా తమకొచ్చిన ఆలోచనలు, అభిప్రాయాల్ని బహిరంగంగా పంచుకోవడం వల్ల సహోద్యోగుల మధ్య పొరపచ్చాలు దొర్లకుండా ఉంటుందంటున్నారు నిపుణులు. ఇది పని ప్రదేశంలో స్నేహపూర్వక వాతావరణం అలవడేలా, సహోద్యోగుల మధ్య చెలిమి పెరిగేలా చేస్తుందని చెబుతున్నారు.



* పని విషయంలో స్పష్టత, పైఅధికారులు సహోద్యోగుల మార్గదర్శకత్వంలో పని చేయడం వల్ల వ్యక్తిగతంగా ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది. ఇది మరింత సమర్థంగా పని పూర్తిచేసేలా ప్రోత్సహిస్తుంది.
* చేసే పనికి సంబంధించిన మార్పులుచేర్పులు, అప్‌డేట్స్.. మొదలైన వాటికి సంబంధించిన పూర్తి సమాచారం ఉద్యోగులందరికీ అందుబాటులో ఉండడం వల్ల నిర్ణీత వ్యవధిలో పని పూర్తి చేసి, లక్ష్యాలను చేరుకునే అవకాశం ఉంటుంది.
* పనికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకొనే క్రమంలో ఇటు పైఅధికారులతో, సహోద్యోగులతో కలిసి పనిచేయడం వల్ల అందరూ కలిసి ఆయా సమస్యలను సులభంగా పరిష్కరించే అవకాశం ఉంటుంది.

ఓవైపు ఉద్యోగి కెరీర్ అభివృద్ధికి, మరోవైపు సంస్థ పురోభివృద్ధికి.. ఇలా రెండు విధాలుగా మేలు చేసే ఈ జపనీస్ కమ్యూనికేషన్ పద్ధతిని ప్రస్తుతం చాలా సంస్థలు తమ వర్క్ కల్చర్‌లో భాగం చేసుకుంటున్నట్లు నిపుణులు చెబుతున్నారు. అలాగే ఉద్యోగులూ వ్యక్తిగతంగా ఈ పద్ధతిని అలవర్చుకొని తమ పనితీరును మెరుగుపరచుకుంటూ కెరీర్‌లో దూసుకుపోవచ్చని అంటున్నారు. మరి, మనమూ పాటించేద్దామా 'హోరెన్‌సో'!




## ఫుట్ ట్యాపింగ్ నెంబర్‌గా 'కనకం'..

టాకీస్: మెట్రో శిరీష్, శ్రియ శరణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నాన్-వయొలెన్స్'. ఇందులో నుంచి తాజాగా యువన్ శంకర్ రాజా కంపోజ్ చేసిన 'కనకం' సాంగ్‌ను రిలీజ్ చేశారు. అదిరిపోయే ఫుట్ ట్యాపింగ్ నెంబర్‌గా ట్యూన్ చేసిన ఈ సాంగ్‌లో యువన్ శంకర్ రాజా, తేజస్విని నందిభట్ల వోకల్స్ కట్టిపడేశాయి. భాష్య శ్రీ అర్థవంతమైన సాహిత్యంతో అలరించారు. మెట్రో శిరీష్, శ్రియ శరణ్ ఎనర్జిటిక్ మూవ్స్‌తో ఆకట్టుకున్నారు. మొత్తంగా ఈ సాంగ్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతూ ఆడియన్స్‌ను మెస్మరైజ్ చేస్తుంది. కాగా.. ఆనంద కృష్ణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏకే పిక్చర్స్ నిర్మిస్తుంది. ఇందులో బాబీ సింహా, యోగి బాబు, అదితి బాలన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

### నేడు రామోజీలో 'ఎస్ఎస్ఎంబీ29'

## మూవీ ఈవెంట్

### పాస్ ఉంటేనే రావాలన్న దర్శకుడు రాజమౌళి





టాకీస్: మహేశ్‌బాబు కథానాయకుడిగా దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో భారీ యాక్షన్ అడ్వెంచర్ తెరకెక్కుతున్న 'ఎస్ఎస్ఎంబీ29' మూవీకి సంబంధించి శనివారం రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ ఈవెంట్ ప్లాన్ చేశారు. దీనికి ప్రత్యేకంగా పాస్‌లు కూడా విడుదల చేశారు. ఈ చిత్రాన్ని శ్రీదుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్ నారాయణ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం అభిమానులు, ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తు న్నారు. దర్శకుడు రాజమౌళి ఈ చిత్రానికి సంబంధించి ఏ సమాచారం లేకుండా పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంక చోప్రా లుక్‌లతోపాటు సంచారి పాటను విడుదల చేసి సినిమాపై మరింత ఆసక్తి రేకెత్తిస్తున్నారు. ఈ నెల 15న రామోజీ ఫిల్మ్ సిటీ ఈ చిత్రానికి సంబంధించి ఓ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జియో హాట్‌స్టార్ లో ఈ వేడుక స్ట్రీమింగ్ కానుంది. దీనికి సంబంధించిన కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈవెంట్‌ను వీక్షించడాని కి వచ్చే అభిమానులు, ప్రేక్షకుల కోసం చిత్ర బృందం ప్రత్యేకంగా పాస్‌లు సిద్ధం చేసింది. పాస్‌పోర్ట్ తరహాలో తీర్చిదిద్దిన ఈ పాస్‌లకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్‌కు సంబంధించి ఆయన పుట్టినరోజులు విడుదల చేసిన ప్రీలుక్‌లో ధరించిన త్రిశూలం బొమ్మతో ప్రింట్ చేసిన పాస్‌లో లోపల పేజీలో మహేశ్, ప్రియాంక, పృథ్వీరాజ్, రాజమౌళి ఫొటోలను, ఈవెంట్‌కు వచ్చేవారు పాటించాల్సిన సలహా, సూచనలు, రూట్ మ్యాప్ అందులో ఉంచారు. ప్రస్తుతం ఈ ఇన్విటేషన్ ప్రేక్షకుల్ని ఆకర్షిస్తోంది. అంతే కాదు ఈ కార్యక్రమానికి వచ్చే ప్రేక్షకులకు జాగ్రత్తలు చెబుతూ రాజమౌళి ఓ ప్రత్యేక వీడియో కూడా విడుదల చేశారు. ఆ ఈవెంట్‌కు పాసులు ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తారని, పాస్ లేకుండా వచ్చి ఇంబ్బందులకు గురి కావొద్దని రాజమౌళి స్పష్టం చేశారు. ఈ ఇన్విటేషన్ చూసి రాజమౌళి ఆలోచనలు.. ప్లానింగ్ నెక్స్ లెవల్ అంటూ, నీ ఇన్నోవేటివ్ థాట్స్ వర్త్ జక్కన్న వర్త్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

## సంక్రాంతి రిలీజ్ కోటాలో అఖండ-2?



**టాకీస్:** టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్‌లలో 'అఖండ 2' ఒకటి. నందమూరి బాలకృష్ణ – బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. 'అఖండ' బ్లాక్‌బస్టర్ విజయానంతరం వస్తున్న సీక్వెల్ కావడంతో అభిమానుల్లో ఉత్కంఠ పీక్స్‌కి చేరింది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో సంయుక్త మీనన్, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన అఖండ 2 ఫస్ట్ గ్లిమ్స్ సోషల్ మీడియాలో దుమ్మురేపింది. బాలయ్య పవర్‌ఫుల్ లుక్, బోయపాటి స్టైల్ మాస్ ఎలివేషన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. సినిమా షూటింగ్, డబ్బింగ్ పూర్తయ్యాయి. అయితే, విజువల్ ఎఫెక్ట్స్ పనులు ఇంకా వేగంగా సాగుతున్నాయి. మేకర్స్ ముందుగా ప్రకటించిన డిసెంబర్ 5 రిలీజ్ ఇప్పటికి అనుమానాస్పదంగా మారింది. రిలీజ్‌కి ఇంకా 20 రోజులు మాత్రమే ఉన్నప్పటికీ, ప్రమోషన్స్‌లో అంత వేగం కనిపించక పోవడంతో మూవీ విడుదలపై అనుమానాలు మొదలయ్యాయి. అంతేకాక ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, మేకర్స్ ఇప్పుడు సంక్రాంతి రిలీజ్ పై దృష్టి పెట్టారని వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది జనవరి 9న విడుదల కావాల్సిన రాజాసాబ్ సినిమా పనులు పూర్తి కావడం లేదని , దీంతో ఆ స్లాట్ ఖాళీ కావచ్చని టాక్ వినిపిస్తున్న నేపథ్యంలో ఆ తేదీకి అఖండ 2ను రిలీజ్ చేసేందుకు టీమ్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇదే నిజమైతే, ఈసారి సంక్రాంతికి బాలయ్య ,చిరంజీవి బాక్సాఫీస్ క్లాష్ జరిగే అవకాశం ఉంది. చిరంజీవి 'మన శంకర వరప్రసాద్ గారు చిత్రం'తో రానుండగా, బాలయ్య 'అఖండ 2'తో దుమ్మురేపేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే అభిమానులు సోషల్ మీడియాలో 'అఖండ 2 ఎప్పుడు రిలీజవుతుంది?', 'సంక్రాంతికేనా?' అని ప్రశ్నలు కురిపిస్తున్నారు. మేకర్స్ త్వరలోనే రిలీజ్‌పై స్పష్టమైన ప్రకటన ఇవ్వనున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో అఖండ 2 రిలీజ్ డేట్ చర్చ హాట్ టాపిక్‌గా మారింది.

## రివాల్వర్ రీటాగా వస్తోన్న కీర్తి సురేశ్



టాకీస్: విభిన్న పాత్రలతో దూసుకుపోతున్న అగ్ర కథానాయిక కీర్తి సురేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. ఈ సినిమాకు కె. చంద్రు దర్శకత్వం వహిస్తుండగా.. సీనియర్ నటి రాధికా శరత్ కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. కీర్తి సురేశ్ ఈ సినిమాలో 'రీటా' అనే సామాన్య మధ్యతరగతి యువతి పాత్రలో కనిపించనుంది. అనూహ్య పరిస్థితుల కారణంగా ఆమె తుపాకీ (రివాల్వర్) పట్టుకోవాల్సి వస్తుంది. ఆ తర్వాత ఆమె ఎలాంటి సాహసాలు, సవాళ్లు ఎదుర్కొంది అనేది ప్రధాన కథాంశం. ఇది కామెడీ అంశాలతో కూడిన పక్కా యాక్షన్ థ్రిల్లర్ చిత్రంగా రాబోతుంది.

## ఈ నెలాఖరులో స్పిరిట్ రెగ్యులర్ షూటింగ్



**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న ప్రాజెక్ట్ 'స్పిరిట్' భారీ బ్జడెట్‌తో తెరకెక్కనుంది. ఈ మూవీని టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనుం డగా.. ప్రస్తుతం ప్రీ ప్రోడక్షన్ పనులు జరుపుకుం టుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మూవీ నుంచి ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా అప్‌డేట్ అంటూ అనౌన్స్‌మెంట్‌ను వీడియోను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ షూటింగ్‌కి సంబంధించి దర్శకుడు సందీప్ రెడ్డి వంగ స్పందించాడు. ఈ సినిమా షూటింగ్‌ను నవంబర్ ఎండింగ్‌లో ప్రారంభించ బోతున్నట్లు సందీప్ రెడ్డి వెల్లడించాడు. నవంబర్ తర్వాత రెగ్యులర్ షూటింగ్ ఉండబోతుందని 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నమని సందీప్ తెలిపాడు. అయితే ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవి ప్రభాస్ తండ్రి పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలను సందీప్ ఖండించాడు. ఇక ఈ చిత్రంలో యానిమల్ భామ తృప్తి డిమ్రి కథానాయికగా నటించబోతుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.